సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్

న్యూస్‌రీల్

పత్రంలో 'ఛత్రపతి'



బాన్సువాడ రూరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పోచారం తండాకు చెందిన సరిచంద్ ఆకుపై శివాజీ చిత్రాన్ని చెక్కారు. మైక్రో ఆర్టిస్ట్ అయిన సరిచంద్.. ఆకులు, సబ్బుబిళ్లలు, సుద్దముక్కలు, పెన్సిల్‌లెడ్‌లపై ప్రతిమలు చెక్కుతూ ప్రశంసలు అందుకుంటున్నాడు.

'దేవాలయ భూములను కాపాడాలి'



భిక్కనూరు: దేవాలయ భూములను కాపాడాల్సిన బాధ్యత పాలకమండళ్లపై ఉందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ పేర్కొన్నారు. శనివారం ఆమె కాచాపూర్ గ్రామంలోని వీరేశ్వరాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలక మండలి సభ్యులతో మాట్లాడారు. దేవాలయం భూములు అన్యాక్రాంతం అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బడి, గుడి ఒక్కటేనని పేర్కొన్నారు. బడి పిల్లలు గుడి స్థలంలో ఆటలు ఆడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సులోచన, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కమల, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్, పూజారి సిద్దరాములు, నేతలు పద్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీకి గురుకుల విద్యార్థి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థి మాలోత్ శ్రీరాం జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరిగిన క్రికెట్ టోర్నీలో బ్యాటింగ్‌తో సత్తా చాటడంతో జాతీయ స్థాయి టోర్నీకి ఎంపిక చేశారు. ఈనెల 21 నుంచి బెంగళూరులో నిర్వహించే జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొననున్నాడు. అతడిని కోచ్, తెలంగాణ యూనివర్సిటీ క్రీడా అధికారి బీఆర్ నేత, అధ్యాపకులు అభినందించారు. గాంధారి మండలం యాచారం తండాకు చెందిన శ్రీరాం జాతీయ స్థాయి టోర్నీకి ఎంపికవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శివలింగానికి నాలుగు కిలోల వెండి తొడుగు



దోమకొండ: మండల కేంద్రంలోని శివరాం మందిర్ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో శివలింగానికి నాలుగు కిలోల వెండి తొడుగు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అబ్రబోయిన రాజు, డైరెక్టర్ చెన్నం రవి, అర్చకులు భావి కృష్ణమూర్తి శర్మ, రామకృష్ణ శర్మ, ట్రాన్స్‌కో ఏఈ ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ డైరెక్టర్ నియామకం

నిజామాబాద్ సిటీ : ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ (సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్) రాష్ట్ర డైరెక్టర్‌గా నారాయణను నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం తెలంగాణ స్టేట్ చైర్మన్ ఉల్లెంగ నాగరాజు ప్రకటన జారీచేశారు. జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు నిజామాబాద్‌కు చెందిన ఎం.నారాయణను రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన సౌత్ ఇండియా చైర్మన్ నజీముద్దీన్‌కు, రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శివోహం

జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో శివ జాగరణలో పాల్గొన్న భక్తులు



కామారెడ్డి టౌన్: జిల్లాలో శివరాత్రి పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. భక్తులు శనివారం తెల్లవారుజామునుంచే ఆలయాలకు పోటెత్తారు. జిల్లాలోని ప్రధాన శివాలయాల వద్ద భారీ క్యూలు కనిపించాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉపవాస దీక్ష స్వీకరించి, జాగారం చేశారు. మహాదేవుడి నామస్మరణతో ఆలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. శనివారం రాత్రి జిల్లాకేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, శ్రీరామసేనల ఆధ్వర్యంలో మహాశివరాత్రి జాగరణ కార్యక్రమం నిర్వహించారు. భారీ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా భక్తులు తరలి వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు.



బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ట్రాఫిక్ బాదుడు!



ట్రాఫిక్ రూల్స్ సామాన్యులను ఇబ్బందిపెడుతున్నాయి. ఇష్టారాజ్యంగా విధిస్తున్న చలానాలతో వాహనదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రధానంగా జిల్లాకేంద్రంలో పార్కింగ్ స్థలాలను చూపడంలో విఫలమైన పోలీసులు.. రాంగ్ పార్కింగ్ పేరుతో జరిమానాలు మాత్రం వడ్డిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- జిల్లాకేంద్రంలో పార్కింగ్ స్థలాలు కరువు
- కాగితాలకే పరిమితమైన స్థలాల ఎంపిక
- షాపుల ముందు వాహనం నిలిపితే ఫైన్‌లు విధిస్తున్న పోలీసులు
- ఇబ్బందిపడుతున్న సామాన్యులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా మారకముందే వ్యాపార, వాణిజ్య రంగాల్లో చుట్టుపక్కల ప్రాంతాలకు కూడలిగా ఉంది. జిల్లాగా ఏర్పాటయ్యాక అభివృద్ధి వేగం పెరిగింది. కామారెడ్డికి వచ్చిపోయేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా ఏర్పడిన తొలినాళ్లలో అప్పటి ఎస్పీ శ్వేత పార్కింగ్ స్థలాల కోసం మున్సిపల్ యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపించారు. కొత్తబస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, నిజాంసాగర్ చౌరస్తా, ఇందిరాచౌక్, సిరిసిల్ల రోడ్డు, తిలక్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పార్కింగ్ కోసం 17 స్థలాలను ప్రతిపాదించారు. అయితే మున్సిపల్ అధికారులు, పాలక వర్గం దానిని పెద్దగా పట్టించుకోలేదు. దీంతో పార్కింగ్ స్థలాల ఎంపిక కాగితాలకే పరిమితమైంది. పట్టణంలో వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలు ఉన్నప్పటికీ పోలీసు, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం కుదరకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

ఆదాయంపైనే దృష్టి..

కామారెడ్డి నాలుగైదు జిల్లాలకు కూడలి కావడంతో వ్యాపార, వాణిజ్యపరంగా బాగా అభివృద్ధి చెందింది. చుట్టుపక్కల జిల్లాలకు చెందినవారు నిత్యం వేలాదిమంది కామారెడ్డికి వచ్చి వెళ్తుంటారు.



పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో..

షాపింగ్ కోసం వివిధ ప్రాంతాల నుంచి కామారెడ్డి పట్టణానికి వస్తుంటారు. వైద్యం కోసమో.. ఇతర అవసరాలకోసమో చాలామంది వాహనాలపై కామారెడ్డికి వస్తారు. బైక్‌లు, కార్లలో వచ్చిన వారు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో దుకాణాలు, హాస్పిటళ్ల ముందు నిలుపుతుంటారు. అయితే చలానాలపైనే దృష్టి సారించిన పోలీసులు.. రాంగ్ పార్కింగ్ పేరుతో వాహనదారులకు జరిమానాలు వడ్డిస్తున్నారు. దీంతో వాహనదారులు షాపింగ్ పూర్తి చేసుకునేలోపే వారి ఫోన్‌కు రాంగ్ పార్కింగ్ పేరుతో చలానా మెస్సేజ్‌లు వెళ్తున్నాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారికి హెల్మెట్ లేదనో, వాహనాలకు సరైన పత్రాలు లేవనో, డ్రైవింగ్ లైసెన్స్ లేదనో జరిమానాలు వడ్డిస్తూనే ఉన్నారు. అది సరిపోదన్నట్లుగా రాంగ్ పార్కింగ్ పేరుతోనూ దోచుకుంటున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుకాణదారులూ పట్టించుకోరు...

వ్యాపారం మీద యావ తప్ప తమ కస్టమర్లను దుకాణాల యజమానులు పట్టించుకోవడం లేదు. వాహనాల పార్కింగ్ విషయంలో కనీసం దుకాణాల యజమానులైనా సొంత పార్కింగ్ స్థలాలు చూపడం లేదు. చిన్న దుకాణాలే కాదు షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్‌లు, హోటళ్ల వద్దా ఇదే పరిస్థితి. కొన్ని భవనాల్లో సెల్లార్లు ఉన్నాయి. వాటిని పార్కింగ్ కోసం వినియోగించాల్సి ఉన్నా అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో వాహనాలను రోడ్డుమీదే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. జిల్లా యంత్రాంగం పట్టణంలో పార్కింగ్ స్థలాల సమస్యను పరిష్కరించి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రధాన ప్రాంతాల్లో పరిస్థితి ఇదీ..

కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో రెండు వాణిజ్య బ్యాంకుల ప్రధాన శాఖలు ఉన్నాయి. బ్యాంకులకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనాలను రోడ్డుమీదనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ధర్మశాల ప్రాంతంలో దుకాణాలు, ఆస్పత్రులు ఉన్నాయి. అక్కడా ఇదే పరిస్థితి. తిలక్ రోడ్డు, గంజ్‌రోడ్డు, సుభాష్‌రోడ్డులలో వందలాది దుకాణాలున్నాయి. అన్‌సీజన్‌లోనే రద్దీగా ఉండే రోడ్లవి. ఇక పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌లో అయితే అడుగు తీసి అడుగు పెట్టే పరిస్థితి ఉండదు. అలాంటి చోట కూడా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్డు మధ్య వాహనాలను నిలుపుతున్నారు. కూరగాయల మార్కెట్ దళారుల ఆధీనంలోకి వెళ్లడంతో రైతులు కూరగాయలు తీసుకువచ్చి రోడ్డు మీద కూర్చుంటున్నారు. ఓవైపు వాహనాలు, కూరగాయల అమ్మకాలు, మరోవైపు చిరు వ్యాపారులతో ఆ రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. నిజాంసాగర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్, చర్చి చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ ఉన్నాయి. వేలాది వాహనాలతో రోడ్లు కిక్కిరిసిపోతుంటాయి. రోడ్డు వెడల్పుగా ఉన్నా పార్కింగ్‌కు స్థలాల సమస్య ఉంది. నిజాంసాగర్ రోడ్డును ఇటీవల నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసినప్పటికీ పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. అశోక్‌నగర్ రోడ్డులో వాహనాల పార్కింగ్ సంగతి దేవుడెరుగు రాకపోకలకే ఇబ్బంది ఉంది. స్టేషన్‌రోడ్డు, పాతబస్టాండ్ ప్రాంతాల్లోనూ పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది.



కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ రోడ్డుపై వాహనాలను పార్క్ చేసిన దృశ్యం

విజృంభిస్తున్న లంపి స్కిన్

- వేగంగా వ్యాపిస్తున్న వ్యాధి
- పశువులు మరణిస్తున్నా పట్టించుకోని పశువైద్యాధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో పశువులలో లంపి స్కిన్ వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. వ్యాధి బారిన పడిన ఆవులు వైద్యం అందక విలవిల్లాడుతూ మృత్యువాతపడుతున్నాయి. జిల్లా కేంద్రంలో లంపిస్కిన్ వ్యాధి సోకిన ఓ ఆవును బతికించడానికి స్థానికులు తీవ్రంగా శ్రమించినా ప్రయోజనం లేకుండాపోయింది. రామారెడ్డి మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం, జిల్లా కేంద్రంలో వారం రోజుల క్రితం ఈ వ్యాధి సోకి పలు పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ విషయమై 'సాక్షి' ఈనెల 16వ తేదీన కథనాన్ని ప్రచురించింది. వీక్లీ మార్కెట్, రాంమందిర్ ప్రాంతాలలో వందలాది ఆవులు సంచరిస్తున్నాయని, చాలా ఆవులలో లంపి స్కిన్ వ్యాధి లక్షణాలున్నాయని హెచ్చరించినా.. పశుసంవర్ధక శాఖ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో పశువులు మృత్యువాతపడుతూనే ఉన్నాయి. చాలా ఆవులు వ్యాధి సోకి తీవ్ర అవస్థలు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లంపి స్కిన్ సోకి కొనఊపిరితో ఉన్న ఆవుకు వైద్యం అందిస్తున్న దృశ్యం

చెక్‌డ్యాంతో రైతులకు ప్రయోజనం



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ టౌన్: మండలంలోని చింతల్‌నాగారం శివారులో నూతనంగా నిర్మించిన చెక్‌డ్యాంను శనివారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల రైతుల కోసం మంజీర నదిపై చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం నిర్మించిన చెక్ డ్యాంలతో నీరు నిల్వ ఉండి రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందుతుందని అన్నారు. అనంతరం బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్ మధ్యలో కడెం నుంచి తెచ్చిన మొక్కలను నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ నెలాఖరులో బాన్సువాడకు సీఎం కేసీఆర్ వస్తారని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎజాస్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌నాయక్, గంగాధర్, పాత బాలకృష్ణ, గంగుల గంగారాం, సాయిలు, భూషణ్‌రెడ్డి, గొల్ల సాయిలు, లింగం, శ్రీనివాస్, కిరణ్ తదితరులు ఉన్నారు.

కలకలం రేపిన ఎమ్మెల్యే హత్య కుట్ర

- గతంలో నుంచి జీవన్ రెడ్డి, ప్రసాద్ గౌడ్‌ల మధ్య మనస్పర్థలు
- రూ. 20 లక్షల కాంట్రాక్ట్ బిల్లులే ప్రధాన కారణం

ఖలీల్‌వాడి : ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై మళ్లీ హత్యకు కుట్ర జరిగినట్లు పోలీసులు గుర్తించగా, ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్ రూరల్‌టౌన్ పరిధిలోని న్యూహౌజింగ్‌బోర్డులోని కేసీఆర్ కాలనీలో బొంతు సుగుణ అనే మహిళ ఇంట్లో పేలుడు పదార్థాలను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుగుణను పోలీసులు విచారించగా జనవరి 9న గుర్తు తెలియని వ్యక్తి ద్వారా కొనుగోలు చేసిన పేలుడు పదార్థాలను కల్లెడ సర్పంచ్ భర్త ప్రసాద్ గౌడ్ తన



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ప్రసాద్‌గౌడ్

ఇంట్లో దాచినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా 2022 ఆగస్టు 1న హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై ప్రసాద్ గౌడ్ హత్యాయత్నం చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రసాద్ గౌడ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, ఈ ఏడాది జనవరి 9న ప్రసాద్ బెయిల్‌పై బయటకు వచ్చారు. బయటకు వచ్చిన తర్వాత జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు కొనుగోలు చేసి సుగుణ ఇంట్లో దాచి పెట్టాడని పోలీసులు తాజాగా జరిగిన ఘటన కేసులో వివరించారు.

ఎమ్మెల్యేకు సెక్యూరిటీ పెంపు

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై 2022 ఆగస్టు 1న ప్రసాద్‌గౌడ్ హత్యాయత్నం చేసిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్యేకు సెక్యూరిటీ పెంచారు. గతంలో వన్ ప్లస్ టూ ఉన్న సెక్యూరిటీని టూ ప్లస్‌టూతో పాటు బుల్లెట్ ప్రూఫ్ కారును ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్వార్టర్‌లో వసతి భవనం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు.

బిల్లుల కోసమేనా..!

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, కల్లెడ సర్పంచ్ లావణ్య భర్త ప్రసాద్‌గౌడ్ మధ్య కొన్నాళ్లుగా మనస్పర్థలు ఉన్నాయి. గ్రామంలో రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. పనుల్లో అవకతవకలు జరిగినట్లు మాక్లూర్ ఎంపీవో నివేదిక రూపొందించి, కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ సర్పంచ్‌ను సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో ఎంపీవోపై ప్రసాద్‌గౌడ్ దాడి చేయడంతో మాక్లూర్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సస్పెండ్ విషయం, బిల్లుల విడుదల కోసం ఎమ్మెల్యేను కలవడానికి తన భర్త ప్రసాద్‌గౌడ్ వెళ్లాడని, చంపడానికి కాదని లావణ్య అప్పట్లో మీడియాకు తెలిపారు. దీని వెనుక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హస్తం ఉన్నదని ఆరోపించారు. అదేవిధంగా సోషల్‌మీడియాలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్టు లు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే, ప్రసాద్ గౌడ్‌పై కక్షగట్టినట్లు ఆరోపణలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. ఆగస్టు 1న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో ప్రసాద్‌గౌడ్‌కు బొంతు సుగుణ ఆర్థిక సహాయం అందించారని, అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు ఆ మహిళ ఇంట్లో పేలుడు పదార్థాలు లభించాయి. అయితే పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ప్రసాద్ గౌడ్‌పై పీడీ యాక్ట్

కల్లెడ సర్పంచ్ లావణ్య భర్త ప్రసాద్‌పై ఇప్పటికే ఏడు క్రిమినల్ కేసులు నమోదు (పేలుడు పదార్థాల కేసుతో)అయ్యాయి. ఇటీవల మాక్లూర్ మండలంలోని కల్లెడ గ్రామంలో గోపి అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులో జిల్లా జైలులో ఉన్నారు. ప్రసాద్‌పై జనవరి 8న పీడీ యాక్ట్ నమోదు అయినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

దుంపకుళ్లుతో రూ. 412 కోట్ల నష్టం

మోర్తాడ్: పసుపు పంట చేతికి వచ్చే సమయంలో దుంపకుళ్లు సోకి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఫలితంగా రైతులను కోలుకోలేని విధంగా దెబ్బ తీసింది. పంట దిగుబడులు తగ్గిపోవడం, మార్కెట్‌లో ఇప్పుడున్న ధరను పరిగణనలోకి తీసుకుని అంచనా వేస్తే జిల్లాలో పసుపు సాగు చేసిన రైతులకు రూ.412.50 కోట్లకు మేర నష్టం వాటిల్లినట్లు స్పష్టమవుతోంది. పసుపు పంటకు అంతగా ధర లేకపోయినా దిగుబడులు వచ్చి ఉంటే కొంతైనా ఊరట లభించేది. దిగుబడులు పడిపోవడం, ధర పాతాళానికి చేరడంతో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అయ్యింది. జిల్లాలో వర్షాకాలం సీజన్‌లో పసుపు పంటను 33 వేల ఎకరాల్లో సాగు చేశారు. సాగు సమయంలో పసుపు పంటకు ఎలాంటి ఇబ్బంది కలుగకపోతే ఎకరానికి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తుంది. ఈ లెక్కన జిల్లాలో సాగైన విస్తీర్ణంలో 13.20 లక్షల క్వింటాళ్ల దిగుబడి రావాలి. అయితే దుంపకుళ్లు సోకి పంట దెబ్బతిని పోగా ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే లభించింది. పెద్ద మొత్తంలో రైతులు పంట దిగుబడిని కోల్పోయారు. జిల్లాలో మొత్తం 4.35 లక్షల క్వింటాళ్ల దిగుబడి రైతులకు దక్కింది. అంటే 8.25 లక్షల క్వింటాళ్ల దిగుబడి పడిపోయినట్లు లెక్కతేలుతోంది. ఈసారి



పసుపు మార్కెట్ ఆరంభమైన నుంచి క్వింటాలు పసుపునకు రూ.5 వేలకు మించి ధర పెరగడం లేదు. ఆశించిన మేర దిగుబడి లభిస్తే రూ.660 కోట్ల ఆదాయం రైతులకు సమకూరేది. దిగుబడి తగ్గిపోవడంతో రూ.412.50 కోట్ల సొమ్ము ఆవిరైపోయింది. రైతులకు కేవలం రూ.247.50 కోట్ల రాబడి లభిస్తుందని తెలుస్తోంది. దిగుబడి తగ్గిపోవడంతో కనీసం ఉన్న పంటకైనా ధర ఆశించిన విధంగా లేకపోవడంతో రైతులకు మరింత నష్టం ఏర్పడింది.

క్లుప్తంగా

ఆకట్టుకున్న జడకొప్పు



మోపాల్: మోపాల్‌లోని మహాలక్ష్మీ ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా శనివారం జడకొప్పు వేశారు. కళాకారులు కోలాటం ఆడుతూ తాళ్లతో జడ అల్లారు. ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

గొర్రెల మందపై కుక్కల దాడి



రామారెడ్డి: కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు ముదాం నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ తన గొర్రెలను గుడిసెలో ఉంచి పడుకున్నాడు. రాత్రి కుక్కలు మందపై దాడి చేశాయి. దీంతో పది గొర్రె పిల్లలు చనిపోయినట్లు బాధితుడు తెలిపారు. రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నాడు. కాగా ఇదే గ్రామంలో వారం క్రితం కుక్కల దాడిలో 30 గొర్రెలు చనిపోయాయి. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు మద్దికుంట నర్సాగౌడ్ రూ.మూడు వేల ఆర్థిక సాయం చేశారు.

కల్లు సీసాలో ఎలుక



నిజామాబాద్ సిటీ: కల్లు సీసాలో ఎలుక వచ్చిన ఘటన నిజామాబాదు రూరల్ మండలంలోని కాలూర్ గ్రామంలో చోటుచేసుకుంది. నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కొందరు యువకులు శనివారం కల్లు తాగడానికి కాలూరు బట్టీకి వెళ్లి 12 కల్లు సీసాలు తీసుకున్నారు. కల్లు తాగుతుండగా ఓ సీసాలో చనిపోయిన ఎలుక, ఓ బొద్దింక కనిపించాయి. దీంతో యువకులు ఖంగుతిని బట్టి నిర్వాహకులకు నిలదీశారు. ఇలాంటి కల్లు తాగితే తమ ఆరోగ్య పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎలుకనే వచ్చింది కదా, ఏం కాదులే అంటూ సదరు నిర్వాహకుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, ఆ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కల్లుబట్టి ముందు ఆందోళనకు దిగారు. కల్లుబట్టీల నిర్వాహకులు సీసాలను కడగడం లేదని, సీసాల్లో ఎలుకలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎక్సైజ్ అధికారులు బట్టీలను తనిఖీ చేసి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

జోరుగా కల్తీ కల్లు..

నిజామాబాద్ జిల్లాలో పలు మండలాల్లో కృత్రిమ కల్లు ఏరులై పారుతోంది. కల్లులో చక్రిన్, ఆల్ఫ్రాజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాలను కలుపుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే కల్తీ కల్లు తాగి చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నా ఘటనలు ఉన్నాయి. ఆ బట్టీలపై అధికారుల చర్యలు శూన్యం. మండలంలో కొనసాగుతున్న అన్ని డిపోలపై నిఘా ఉంచాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

‘ఒప్పందం’ లేకపోవడమే సమస్య

- ఎర్రజొన్నకు ఆశించిన ధర నిర్ణయించకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని అధికారుల హెచ్చరిక
- బైబ్యాక్ ఒప్పందం కుదుర్చుకోవడంలో వ్యాపారులు, రైతుల విముఖత
- పంట కోత సమయంలో ధర నిర్ణయంపై ఇరువర్గాల అంగీకారం
- మొదట్లో ధర ఉందని చెప్పి ఇప్పుడు బుకాయిస్తున్న వ్యాపారులు
- ఆందోళన చెందుతున్న కర్షకులు



మోర్తాడ్‌లో కోత దశకు చేరుకున్న ఎర్రజొన్నల పంట

మోర్తాడ్: ఎర్రజొన్న పంటకు రైతులు ఆశించిన విధంగా ధర చెల్లించకపోతే సీడ్ వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎర్రజొన్నలకు ఒక నిర్ణీతమైన ధర నిర్ణయించి బైబ్యాక్ ఒప్పందం కుదుర్చుకోవడంలో వ్యాపారులతో పాటు రైతులు విముఖత చూపడంతోనే ఇప్పుడు సమస్య ఉత్పన్నమైందనే వాదన వినిపిస్తుంది. ఎర్రజొన్నలను ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని ఒప్పందం కుదుర్చుకుంటే అసలు సీజను సమయంలో మార్కెట్‌లో డిమాండ్ లేకుంటే తాము నష్టపోతామని రైతులు భావించారు. ఈ కారణంగా బైబ్యాక్ ఒప్పందానికి వ్యాపారులు వెనుకంజ వేశారు. ఎర్రజొన్నలకు ఒక్కోసారి ధర గణనీయంగా పెరుగుతుండటంతో తక్కువ ధరకు బైబ్యాక్ ఒప్పందం కుదుర్చుకుంటే సీజనులో ధర పెరిగితే నష్టపోతామని రైతులు కూడా బైబ్యాక్ ఒప్పందానికి విముఖత కనబరిచారు. బైబ్యాక్ విషయంలో ఇరువర్గాలు ఎవరి వ్యూహం వారు అనుసరించడం, ఇప్పుడు ఎర్రజొన్నలకు ధర లేదని వ్యాపారులు చెప్పడం, మార్కెట్‌లో పంటకు డిమాండ్ ఉందని రైతులు వెల్లడించడం గందరగోళానికి దారి తీస్తుంది. ఎర్రజొన్నలను క్వింటాలుకు రూ.4,300 వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని వెల్లడించిన వ్యాపారులు ఇప్పుడు బుకాయిస్తుండటం వెనుక సిండికేట్ హస్తం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. పాత జొన్నలను రూ.3,900కు క్వింటాలు చొప్పున కొనుగోలు చేసిన వ్యాపారులు కొత్త పంటకు ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుందని రైతులు వెల్లడిస్తున్నారు. వ్యాపారులు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరించడంతో ధర తగ్గింపు వెనుక సిండికేట్ ప్రభావం ఉందని రైతులు వివరించారు. బైబ్యాక్ ఒప్పందం కుదుర్చుకోకపోవడం, ఇప్పుడు ధర నిర్ణయించే సమయంలో ఇబ్బందికరమైన పరిస్థితులను కల్పించినట్లైతుంది.

అంతా అధికార పక్షమే...

జిల్లాలోని సీడ్ వ్యాపారులలో ఒకరు ఇద్దరు మినహా అందరు అధికార పార్టీ కీలక నేతలకు సన్నిహితులు కావడం విశేషం. ఎర్రజొన్నలకు ధర నిర్ణయించే విషయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో ధర తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. ఎర్రజొన్నల ధర విషయమై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో రెండు రోజుల కింద ఫోన్‌లో మాట్లాడారు. సిండికేట్‌గా మారిన సీడ్ వ్యాపారులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే సీడ్ కంపెనీల లైసెన్స్‌లను రద్దు చేయాలని కూడా మంత్రి కలెక్టర్‌కు సూచించారు. ఈ తరుణంలో స్పందించిన కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులను నష్టపరిచే సీడ్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీడ్ వ్యాపారులు మాత్రం అంతా అధికార పక్షానికి చెందిన వారు కావడంతో వారిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడానికి సాహసిస్తుందా అనే సందేహం వ్యక్తం అవుతోంది.

‘డబుల్’ పంపిణీ ఎప్పుడో?

- జనవరి 15లోగా కేటాయిస్తామని గతంలో చెప్పిన మంత్రి కేటీఆర్
- ఇంకా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయని వైనం
- ఆందోళన చెందుతున్న పేదలు

మోర్తాడ్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కావచ్చినా లబ్ధిదారుల జాబితాలను ఇంకా సిద్ధం చేయలేదు. దీంతో డబుల్ ఇళ్ల కేటాయింపులకు ముహూర్తం ఎప్పుడు ఖరారు చేస్తారో అని అర్హులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇలా ఉన్నతాధికారులు, మంత్రులు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని ప్రతిసారి ఆదేశిస్తున్నారు. అయినప్పటికి లబ్ధిదారుల ఎంపిక ఒక కొలిక్కి రాలేకపోతుంది. దరఖాస్తుల సంఖ్య అధికంగా ఉండటం ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండటమే లబ్ధిదారుల ఎంపికకు అడ్డంకులు సృష్టిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. 2023 జనవరి 15వ తేదిలోగా డబుల్ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని ఐటీ శాఖ మంత్రి కె తారకరామారావు గతంలో ఆదేశించారు. సంక్రాంతి పండుగ కానుకగా అర్హులైన వారికి డబుల్ ఇళ్లను కేటాయిస్తామని మంత్రి వెల్లడించారు. ఇప్పటి వరకు లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయకపోవడం, జిల్లాలోని ఏ నియోజకవర్గంలో ఇళ్లను కేటాయించకపోవడంతో అమాత్యుల ప్రకటన కోసం దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు.

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 3,682 ఇళ్లను నిర్మించారు. వీటి కోసం దాదాపు 50వేల దరఖాస్తులు అధికారులకు అందగా వాటిని పరిశీలించారు. అర్హులు ఎవరో తేల్చడానికి రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు విడివిడిగా సర్వే చేశారు. కింది స్థాయి ఉద్యోగుల సర్వేలను క్రాస్ చెక్ చేయడానికి ఉన్నతాధికారులు స్వయంగా రంగంలోకి దిగారు. అర్హుల జాబితాలను సిద్ధం చేయడానికి దరఖాస్తులను జల్లడపట్టామని అధికారులు వెల్లడించారు. అయినా ఇప్పటి వరకు జాబితాలను ప్రకటించకపోవడం గమనార్హం. త్వరలోనే ముందస్తు ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందని ఊహాగనాలు వినిపిస్తున్నాయి. ఒక వేళ అదే జరిగితే ఎన్నికల్ కోడ్ కారణంగా డబుల్ ఇళ్ల కేటాయింపు నిలచిపోతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.



మోర్తాడ్‌లో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

మార్కెట్లో పండుగ సందడి

కామారెడ్డి టౌన్: శివరాత్రి పండుగ పురస్కరించుకుని మార్కెట్‌లో సందడి నెలకొంది. శనివారం ప్రధాన రోడ్లన్నీ ప్రజలతో కిక్కిరిసి పోయాయి. కామారెడ్డిలోని సుభాష్‌రోడ్, జేపీఎన్, మాయాబజార్, సిరిసిల్లరోడ్, కొత్తబస్టాండ్, నిజాంసాగర్‌చౌరస్తాలో పండ్లు, పూల దుకాణాలు వెలిశాయి. పండుగ అదునుగా అమాంతంగా పండ్ల ధరలను ఆకాశనంటాయి. శనివారం పండ్ల ధరలు రెండితలు పెంచి విక్రయించారు. అరటిపండ్లు డజను రూ.80, ద్రాక్ష కిలో రూ.100, ఆపిల్స్ రూ.180, దానిమ్మ కిలో రూ.200, ఆరెంజ్ రూ. 150 కిలో చొప్పున అమ్మారు.



పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు





పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

కల్లుబట్టీని తొలగించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ధర్మారం గ్రామస్తులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామ సమీపంలో ఉన్న కల్లుబట్టీని వెంటనే తొలగించాలని ధర్మారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఎంఎస్సీ ఫారం గ్రామంలో గల నిజామాబాద్– బోధన్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎంఎస్సీ ఫారం గ్రామం మీదుగా ధర్మారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే కల్లుబట్టీని ఏర్పాటు చేశారని, దీంతో దారిలో వెళ్లే మహిళలను తాగుబోతులు వేధిస్తున్నారన్నారు. అలాగే పాఠశాల/కళాశాలకు వెళ్లే విద్యార్థినులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధాన రహదారి పక్కనున్న కల్లు దుకాణాన్ని తొలగించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్వాహకులు పట్టించుకోకుండా, దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. రాస్తారోకోతో దాదాపు గంటపాటు రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కల్లుబట్టి తొలగించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. ధర్మారం గ్రామస్తులు రవి సాయిలు, గంగాదాస్ సురేష్ కృష్ణతో పాటు దాదాపు 100మంది పాల్గొన్నారు.

రెండు గదులు.. ఐదు తరగతులు

ఇద్దరే ఉపాధ్యాయులు

- అల్లాపూర్ ప్రాథమిక పాఠశాల పరిస్థితి
- టీచర్లు, గదులు సరిపోక ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య



అల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో కూర్చున్న మూడు తరగతుల విద్యార్థులు

పిట్లం: ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమాణాలు కొరవడుతున్నాయి. మన ఊరు–మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా.. పలు బడుల్లో ఉపాధ్యాయులు, తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు రెండే గదులు ఉన్నా మన ఊరు - మనబడి పథకంలో ఈ పాఠశాలపై దయ చూపలేదు. ఈ పాఠశాలలో 2018 సంవత్సరం జనవరి నుంచి 2022 జనవరి వరకు ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వహించారు. 2022 జనవరిలో మరో ఉపాధ్యాయుడు పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ అయి రాగ అతను సైతం 2022 నవంబర్‌లో ఇన్ సర్వీస్ బీఎడ్ ట్రెయినింగ్‌కు వెళ్లాడు. పాఠశాలలో ఐదు తరగతులకు ప్రస్తుతం ఒక రెగ్యులర్, డిప్యూటేషన్‌పై వచ్చిన మరో ఉపాధ్యాయుడు ఉన్నారు. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవనం కూలీ పోవడంతో సర్పంచ్, గ్రామ పెద్దలు ప్రాథమిక పాఠశాలలో ఉన్న మూడు గదులల్లో ఒకదానిని అంగన్‌వాడీకి కేటాయించారు. అప్పటి నుంచి పాఠశాలలోని ఐదు తరగతులను రెండు గదుల్లోనే కొనసాగిస్తున్నారు. ఒక గదిలో మూడు క్లాసులు, మరో దాంట్లో రెండు క్లాసులు, స్టాఫ్ రూం నిర్వహిస్తున్నారు. బడిలోని వంటశాల సైతం శిథిలావస్థకు చేరింది. అంగన్‌వాడీ సెంటర్‌కు కేటాయించిన ఒకే గదిలో వంట సామగ్రి, పిల్లలు ఉండటంతో చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పాఠశాలలో పూర్తి స్థాయి సిబ్బంది, సరిపడ గదులు లేక పోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ఈ పాఠశాలకు పంపకుండా ఇతర గ్రామాల బడులు, ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. పాఠశాలలో గతంలో 78 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతూ ప్రస్తుతం 45కు చేరింది. పాఠశాల సమస్యలను పరిష్కరించకపోతే తమ పిల్లలను కూడా వేరు బడులకు పంపుతామని తల్లిదండ్రులు అంటున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలని కోరుతున్నారు.



పాఠశాలలో శిథిలావస్థకు చేరిన వంటశాల

ఇబ్బందులు పడుతున్నారు



ఒకే గదిలో మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక తరగతి విద్యార్థులకు చెప్పే పాఠం మిగతా రెండు తరగతుల విద్యార్థులు వింటున్నారు. దీంతో విద్య బోధన అస్తవ్యస్తంగా మారింది. నాయకులు, అధికారులు స్పందించి పాఠశాలలో అదనపు తరగతులు నిర్మించాలి. – దత్తు, విద్యార్థి తండ్రి, అల్లాపూర్

అదనపు గదులు ఏర్పాటు చేయాలి



పాఠశాలలో రెండే గదులు ఉండటంతో ఒక గదిలో మూడు తరగతులు, మరో దాంట్లో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. వాటిల్లోనే స్టాఫ్‌రూం, వంట సామగ్రి పెడుతున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బదులకు గురవుతున్నారు. పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలి. – లక్ష్మణ్, విద్యార్థి తండ్రి, అల్లాపూర్

క్రైం కార్నర్

నీటిలో పడి జాలరి మృతి



నందిపేట్: మండలంలోని లక్కంపల్లి గ్రామానికి చెందిన గూండ్ల మురళి అలియాస్ జుమ్మెరాత్ మురళి(44) అనే జాలరి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. వివరాలు.. మురళి శనివారం గ్రామానికి చెందిన గూండ్ల గంగాధర్, భాస్కర్‌లతో కలిసి లక్కంపల్లి శివారులోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చెరువులో తెప్పపై వెళ్తుండగా అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వచ్చి నీటిలో పడిపోయాడు. తోటి జాలరులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. దోమకొండ మండలం అంచనూరుకు చెందిన బైకారి మహేశ్(32) పొట్టకూటి కోసం 11 ఏళ్ల క్రితం కాచాపూర్ గ్రామానికి వచ్చాడు. పదేండ్ల క్రితం కామారెడ్డికి చెందిన శ్యామలను ప్రేమ వివాహం చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం శ్యామలకు పక్షపాతం వచ్చింది. ఆమెను ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో కామారెడ్డిలోనే తన తల్లి గారింటివద్దనే ఉంటుంది. అప్పటి నుంచి మహేశ్ మానసికంగా బాధపడుతు మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట వెనకాల జాతీయ రహదారిపై ఓ వ్యక్తి బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు నిజామాబాద్‌లోని వినాయక్ నగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

మహాదేవుడి ఆలయంలో ఎస్పీ దంపతుల పూజలు



దోమకొండ: దోమకొండ గడికోటలోని మహదేవుని ఆలయాన్ని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా గడికోటలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ కామినేని శోభన, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి, ఐరేని నర్సయ్య, కుంచాల శేఖర్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని దొడ్డి కొమురయ్య కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ గౌడ్ తెలిపారు. మృతుడి ఒంటిపై ఎల్లో కలర్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుక్కల దాడిలో గాయాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. శనివారం కుక్కల గుట్ట వద్ద, ఎంజే ఆస్పత్రి సమీపంతో పాటు ఇతర కాలనీల్లో మొత్తం ఎనిమిది మందిపై కుక్కలు దాడి చేశాయి. బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

లొంకను మరింత అభివృద్ధి చేస్తా



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: లొంక రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. లొంక ఆలయాన్ని శనివారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భగుడిలో ఇసుక లింగానికి అభిషేకం చేసి పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్నారు. శివపార్వతుల కల్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు సమర్పించుకున్నారు. ఆయనకు పురోహితులు తీర్థప్రసాదాలు అందచేశారు. పూజల్లో ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ సారిక, సర్పంచ్‌లు రాజారెడ్డి, రమేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, రాజేందర్, సంతోష్ రెడ్డి, తిర్మల్, నర్సారెడ్డి, లింగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, భూపతిరాజు, గంగాధర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కామారెడ్డి క్రైం: బైక్ అదుపు తప్పి కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రోడ్ ఇందిరానగర్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని హరిజనవాడకు చెందిన సాయినాథ్(23) స్నేహితులతో కలిసి బైక్‌పై గర్గుల్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్ర గాయాలైన అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.